క్లుప్తంగా

వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు



గురజాల : వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు ఆనందంగా ఉండాలని కోరుతూ దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. దత్తు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతూ ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యుడు రెంటాల నాగేశ్వరరావు, నారాయణభట్ల సుబ్రమణ్యం, కౌన్సిలర్ బండి రవికుమార్, తంగెడ బాబు, తదితరులున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గురజాల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశానికి ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు అందరూ హాజరుకాగలరన్నారు.

నిండు మనస్సుతో ప్రార్థిస్తే దీవెనలు



విజయపురిసౌత్: నిండు మనస్సుతో మరియతల్లిని ప్రార్థిస్తే భక్తులకు దీవెనలు అందుతాయని సాగర్‌మాత ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. సాగర్‌మాత ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన దివ్యబలి పూజా కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సమాజంలో తోటి వారిని ప్రేమిస్తూ నీతివంతమైన జీవితం గడపాలని అన్నారు. దీనికి ముందు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనికరం కలిగిన తల్లి కార్మెల్‌మాత

ఫాదర్ ఏలీషారాజు



రెంటచింతల: దయ, కరుణ, ప్రేమ, కనికరం కలిగిన తల్లి కార్మెల్‌మాత అని రె.ఫాదర్ కొణతం ఏలీషారాజు అన్నారు. స్థానిక నాయుడుపేట కాలనీలో మాజీ సర్పంచ్ గుర్రాల రాజు నిర్మించిన కార్మెల్‌మాత మందిరం 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలిలో ఫాదర్ ఏలీషారాజు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనల ద్వారా కోరిన వరాలు ఇచ్చే తల్లిగా కార్మెల్‌మాత కొనియాడబడు తుందన్నారు. ఈ మందిరం గ్రామానికే ఒక ప్రత్యేకతను తీసుకువచ్చిందన్నారు. సమష్టి దివ్య పూజాబలి అనంతరం గుర్రాల రాజు భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్మెల్‌మాత మందిరం వేడుకల్లో కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్ధుమ్రెడ్డి, సహాయగురువులు ఫాదర్ స్లీవారెడ్డి, మఠకన్యలు, కానుకమాత చర్చిపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక పూజలు



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసి ఉన్న ప్రసిద్ధి చెందిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో స్వామివార్లకు ఆదివారం ప్రత్యేక పూజాలు, హోమములు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు సీహెచ్ శివయ్యశర్మ నేతృత్వంలో ప్రదోష కాలంలో నందీశ్వరునికి అభిషేకం నిర్వహించి స్వామివారి సన్నిధిలో లక్షబిల్వార్చన, రుద్ర హోమం, కుంకుమార్చన, తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు.

ప్రతి ఇంటికి కృష్ణమ్మ జలం

- నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయి
- జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయి ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటికే ప్రారంభమైన పైప్‌లైన్ పనులు



కుళాయి పంపు



అంజనాపురం గ్రామంలో పైప్‌లైన్ పూర్తి చేసి కుళాయి కనెక్షన్‌లకు సిద్ధం చేసిన దృశ్యం

గురజాల : పల్నాడు ప్రాంతంలోని ప్రజలకు చెంతనే కృష్ణమ్మ ఉన్న అవి తాగేందుకు ఉపయోగపడని విధంగా ఉండేవి. వేసవి కాలం వచ్చిందంటే నీటి ఎద్దడి పెరిగి పోయి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేంది. పంచాయతీ నీరు సరిగ్గా అందక రాత్రి వేళల్లో ప్రజలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసిన ఘటనలు ఎన్నో.. గత ప్రభుత్వంలో అలసత్వం వహించడం వల్ల నీటి ఎద్దడి తీవ్రంగా కనిపించింది. పనులు ప్రారంభించి ప్రజలకు మంచినీటిని అందించాలనే ఆలోచన లేకపోవడంతో ఇబ్బందులకు గురికావల్సివచ్చేంది. వేసవి కాలంలో రాష్ట్ర స్థాయిలోనే అధికంగా ఉష్ణోగ్రత నమోదు కానున్న ప్రాంతం పల్నాడు ప్రాంతం. ఈ ప్రాంతంలో ఫిబ్రవరి నెల నుంచే వేసవి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు జరుగుతాయి. ఏప్రిల్, మే నెలలో ఇళ్లలో బోర్లు ఎండిపోయి చుక్క నీరు బయటకు రాని పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వర్షాలు సంవృద్ధిగా కురుస్తుడడంతో నీటి శాతం మట్టం భారీగా పెరిగాయి. దీంతో నీటి ఎద్దడి కొంత మేరకు తగ్గింది.

నియోజకవర్గంలో 2001 బోరింగులు...

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2001 చేతి బోరింగులు ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూయస్ అధికారులు వెల్లడించారు. గురజాల 516, దాచేపల్లి 396, మాచవరం 402, పిడుగురాళ్ల 687 బోరింగులు ఉన్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో వుంచుకుని మరమ్మతులకు వచ్చిన వాటిని బాగుపరిచేందుకు పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఆర్‌డబ్ల్యూయస్ అధికారుల దృష్టికి వచ్చిన బోర్లు మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

మండలంలో ఇలా....

మండల పరిధిలోని గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి అందించడంలో భాగంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తీసుకున్న చొరవతో మొదటి విడతగా పనులు ప్రారంభించారు. ప్రతిరెండు నెలలకు ఒక గ్రామంలో పనులు పూర్తిచేసి ప్రతిఇంటికి మంచినీటి కుళాయి ద్వారా నీటిని అందించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే మాడుగుల శివారు అంజనాపురం గ్రామంలో పనులు పూర్తయ్యాయి. గ్రామంలో ఇప్పటికే పైపులైన్ ఏర్పాటు చేశారు. త్వరలో అన్నిగ్రామాల్లో పనులు ప్రారంభించి ఏడాదిలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి కృష్ణమ్మ నీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామాల వారీగా నిధులు మంజూరు ఇలా...

గ్రామం పేరు	నిధులు మంజూరు లక్షల్లో
గొట్టిముక్కల	163.8
సమాధానంపేట	125.7
తేలుకుట్ల	236
దైద	270.5
పులిపాడు	190
గంగవరం	158.5
కొత్త అంబాపురం	45
పాత అంబాపురం	90
పల్లెగుంత	95
బూదవాడ	99.6
గోగులపాడు	90
చర్లగుడిపాడు	195.4
మాడుగుల	145
అంజనాపురం	85.5
జనార్థనపురం క్యాప్	57.7
గురజాల నగర పంచాయతీ	8.5 కోట్లు



అంజనాపురం గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధం చేసిన అధికారులు

ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇస్తాం....



మండలంలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఇచ్చే విధంగా ప్రణాళిక రూపొందించడం జరిగింది. ఇప్పటికే మండలంలో ఒక గ్రామంలో పనులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో సైతం పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి కనెక్షన్ ఇస్తాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో ప్రతి ఇంటికి నీటి కుళాయి అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు.

– పోలు పవన్మయివీరారెడ్డి, గురజాల నగరపంచాయతీ చైర్మన్

వైఎస్సార్ సీపీతోనే అన్నివర్గాలకు సముచిత స్థానం

- రూ. 30 లక్షలతో వడియరాజుల కల్యాణ మండపం నిర్మిస్తాం
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సభను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



అర్బన్ హెల్త్ సెంటర్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఏళ్ల తరబడి వడియరాజులను రాజకీయంగా తెలుగు దేశం పార్టీ వాడుకుందే కానీ వారి గురించి ఆలోచించిన దాఖలాలు లేవని, వడియరాజులు తమకు కమ్యూనిటీ హాల్ కేటాయించమని కోరిన వెంటనే రూ. 30 లక్షలతో వడియరాజుల కల్యాణ మండపం నిర్మిస్తున్నామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలియజేశారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అర్బన్ హెల్త్ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

టీడీపీ హయంలో ఒక్క పబ్లిక్ హెల్త్ సెంటర్ అయినా కట్టారా...

తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పబ్లిక్ హెల్త్ సెంటర్ అయినా కట్టిన దాఖలాలు లేవని, తాము అధికారలోకి వచ్చిన వెంటనే పట్టణంలో మూడు పబ్లిక్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామని, పట్టణంలోని జానపాడు రోడ్డులో పట్టణానికి దూరంగా ఉన్న 13,12,6,23 వార్డులో వెనుక బడిన ప్రజల కోసం ఏర్పాటుచేసి దానిని ప్రారంభించామని, అదేవిధంగా పట్టణంలోని 31, 32, 1 లెనిన్ నగర్‌లో రెక్కడితే కాని డొక్కాడని ప్రజల కోసం ఏర్పాటు చేసి ప్రారంభించుకున్నామని, త్వరలోనే బస్టాండ్ వద్ద ఉన్న పబ్లిక్‌హెల్త్ సెంటర్‌ను కూడా ప్రారంభిస్తామని ఇలా పట్టణానికి మూడు వైపులా ప్రజలకు అందుబాటులోకి వైద్యాన్ని తీసుకుని వచ్చామని ఆయన తెలియజేశారు.

వడియరాజులను అక్కున చేర్చుకుంది వైఎస్సార్‌సీపీనే...

గతంలో వడియరాజులను నియోజకవర్గంలో వడ్డెరులని పిలిచేవారని తాను నియోజకవర్గంలోని అడుగు పెట్టిన వెంటనే వడ్డెరులను వడియరాజులని పిలవడం జరిగిందని, చంద్రగిరి ఏసురత్నంకు జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఇచ్చారని, అదేవిధంగా వడియరాజులను గుర్తించాలనే లక్ష్యంతోనే కొమెర వెంకటేశ్వర్లను పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ చేసి నియోజకవర్గ పదవి కేటాయించామని ఆయన తెలియజేశారు. అదేవిధంగా బీసీలను గౌరవించే పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీనేని తెలియజేశారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్సీ పదివి ఇచ్చి గౌరవించటం, చంద్రగిరి ఏసురత్నంకు ఎమ్మెల్సీ ఇవ్వడం, అదేవిధంగా మైనార్టీ వర్గానికి చెందిన ఎండీ గఫార్‌ను మార్కెట్‌యార్డు చైర్మన్ చేయడం, జైలాబ్దిన్‌ను మున్సిపల్‌వైస్ చైర్మన్ చేయడం, ఎస్సీలలో కొమ్ము ముక్కంటిని మున్సిపల్ వైస్ చైర్మన్ చేసి అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించామన్నారు.

లెనిన్ నగర్‌ను అభివృద్ధి చేస్తాం...

పట్టణంలోని లెనిన్ నగర్ వైఎస్సార్‌సీపీ హయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, లెనిన్ నగర్‌లో ఎప్పటి నుంచో ఉన్నంటు వారందరికి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించామని తెలియజేశారు. అదేవిధంగా శ్మశాన వాటిక లేక ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దానికి కూడా నిధులు కేటాయించేలా చూస్తానని తెలియజేశారు. లెనిన్ నగర్‌లోని హైస్కూల్ కూడా మరో 6 నెలల్లో పూర్తి అవుతుందని, షాదీఖానా పిల్లుట్ల రోడ్డులో ముస్లింలకు కేటాయిస్తే లెనిన్ నగర్‌లో వడియరాజుల కోసం రూ. 30 లక్షలతో కల్యాణ మండపం కడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మార్కెట్ యార్డు చైర్మన్‌కొమెర వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, వైఎస్సార్ సీపీ నాయకులు కత్తెరపు రాంగోపాల్‌రెడ్డి, కందుర్తి గురవాచారి, ఇర్లా గురుస్వామి, దేవళ్ల నాగరాజు, మున్సిపల్‌కౌన్సిలర్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



కనకదుర్గమ్మ వారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు



రెంటచింతలలో ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్న భక్తులు

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారికి వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి రామాంజిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ గుంటక పెద చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ బత్తుల వీరయ్యల ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో మహిళలు ఉదయం నుంచే ఉత్సాహంగా అమ్మవారి కార్యక్రమాలలో పాల్గొని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని బోనాలు సమర్పించుకున్నారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ అమ్మవారికి ప్రతి ఏటా బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో కల్లం వీరారెడ్డి, గుంటక మార్కొండారెడ్డి, లింగాల రాఘవాచారి, అయ్యన్న, చపారపు అడవిరాముడు, దేవిశెట్టి వెంకటేశ్వర్లు, విడేల రామ సుబ్బారావు మహిళలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు...

రెంటచింతల: గ్రామ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా శాంతియుతంగా సుఖసంతోషాలతో జీవించేలా కరుణించమ్మా ...ముత్యాలమ్మ తల్లీ అంటూ ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారికి రేగులమాణ్యం కాలనీకి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలను సమర్పించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో వేంచేసిన ముత్యాలమ్మ ఆలయంలో అర్చకులు శ్రేష్టి శ్రీనివాసశర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో బోనాలతో మహిళభక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు సాగు చేస్తున్న పైరుపంటలు సమృద్ధిగా పండి వారి ఇంట సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు.

శాకంబరిగా పోలేరమ్మతల్లి

అచ్చంపేట: మండలంలోని చామర్రులో గ్రామదేవతగా భక్తులతో పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లిని భక్తులు ఆదివారం శాకంబరిగా అలంకరించారు. పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పవన్ విమర్శలు చేయడానికి సినిమా కాదు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి

మాచర్ల: రాష్ట్రంలో ఒక పార్టీని నడుపుతూ సంస్కారం లేకుండా ఏకవచనంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం అతని మానసిక స్థితి దెబ్బతిని పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ ప్యాకేజీల పిచ్చితో ప్రజలెన్నుకున్న సీఎంను విమర్శించడం అతని అవివేకానికి నిదర్శనమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. ఆదివారం మార్కెట్ యార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పవన్ వ్యాఖ్యల పై ఫైర్ అయ్యారు. మతి చలించి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు చోట్ల పోటీ చేసి గెలవలేని నువ్వు ప్రతి సారీ ఎన్నికలకు ఏదో ఎల్లో పార్టీకి మద్దతు పలికే నీకు జగన్‌ను ప్రశ్నించే అర్హత ఉందాని అన్నారు. 151 సీట్లను 51 శాతం ఓట్లతో గెలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సంస్కారం లేకుండా మాట్లాడడం ఏమి సంస్కారమని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో అనేక చోట్ల పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయిన మీ జనసేన పార్టీ గురించి ప్రజలందరికీ తెలుసునన్నారు. అటువంటి నువ్వు ఎవరినో ముఖ్యమంత్రి చేయడానికి ప్రయత్నంలో భాగంగా తకు ఇష్టం వచ్చినట్లు వ్యవస్థల పై దాడి చేసి వ్యక్తిగత విమర్శలు చేయడానికి ఇది సినిమా కాదన్నరు. నిజ జీవితంలో రియల్ హీరోగా కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను అధికారంలోకి తీసుకొచ్చి ప్రజలకు రూ. 2.10 లక్షల కోట్లను నేరుగా బదిలీ చేసి పారదర్శకంగా వ్యవహరిస్తున్న సీఎం జగన్ గురించి నువ్వా మాట్లాడేది. ప్రజలంతా నీకు మరోసారి మరింత తీవ్రంగా బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో బహుళ ప్రయోజనాలు

ముప్పాళ్ల: పచ్చిరొట్ట పైర్లతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పేర్కొన్నారు. పెరిగిన ఎరువుల ధరలతో సాగు భారంగా మారిన తరుణంలో పచ్చిరొట్ట పైరు సాగుకు ఎంతో ఉపయోగకారిగా ఉంటుందని చెప్పారు. తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ, పిల్లిపెసరలతో పాటుగా పెసరను పచ్చిరొట్టగా సాగు చేసుకోవచ్చన్నారు. మండలంలో అధికంగా మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతుండటం, సాగు చేసే సమయం కూడా అధికంగా ఉండటంతో ముందస్తుగా పచ్చిరొట్ట పంట వేసుకున్నట్లయితే కొంత మేర పెట్టుబడి తగ్గించుకోవచ్చని సూచించారు. మొక్కజొన్న సాగులో అధికంగా యూరియా వాడుతుండటంతో భూసారం దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

వైఎస్సార్ జలకళ రైతులకు ప్రయోజనకరం

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే)
- చింతలతండాలో జలకళ కింద బోరు ప్రారంభం



చింతలతండా గ్రామంలో బోరును ప్రారంభించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

విజయపురిసౌత్: సాగునీటికి ఇబ్బంది పడుతున్న రైతాంగానికి వైఎస్సార్ జలకళ ఎంతో ప్రయోజనకరమని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండలంలోని చింతలతండా గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా బోరును ప్రారంభించి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ ద్వారా రాష్ట్రంలో సాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రతి రైతుకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రైతు పక్షపాతి అయిన జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ప్రవేశపెట్టిన పలు పథకాలతోపాటు వైఎస్సార్ జలకళ సన్న, చిన్నకారు రైతులకు ఒక వరమన్నారు. జలకళ ద్వారా 2.5 నుంచి 5 ఎకరాలలోపు రైతులకు ఉచితంగా బోరు వేసి, మోటారు, విద్యుత్ కనెక్షన్ అందించి అన్నదాతలను ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ పీఆర్కేను గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీను, మాచర్ల మండల జేసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, ఎంపీటీసీ కేతావత్ బుజ్జి సీతానాయక్, వైస్ సర్పంచ్ లచ్చూనాయక్, మాజీ ఎంపీటీసీ కేతావత్ జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతావత్ హనుమానాయక్, కె శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలోని కారెంపూడి గ్రామ రైతు రమావతు తేజానాయక్ పొలంలో వైఎస్సార్ జలకళ పథకం కింద ఆదివారం ప్రభుత్వం ఉచితంగా బోరు వేయించింది. బోరు తవ్వకం పనులు రైతుల కోలాహలం మధ్య ప్రారంభమయ్యాయి. బోరు తవ్వకం పనులను జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, సర్పంచ్ ప్రమీలాభాయి, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ షఫీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీలు ఏసోబు, లింగయ్య, ట్రస్టు బోర్డు చైర్మన్ చల్లా ప్రసాద్, పాతూరి రామిరెడ్డి, పొట్టుమూర్తి లింగం, జక్కా నరసింహారావు తదితరులు ప్రారంభించారు. చింతపల్లి గ్రామంలో రైతు బొట్లగుంట క్రిష్ణ పొలంలో కూడా జలకళ పథకం కింద ఆదివారం బోరు వేశారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు గాడిపర్తి పూర్ణయ్య, బొట్లగుంట రామారావు, ఆశం భాస్కరరెడ్డి, మర్రి శేషయ్య, సూరె వెంకటేశ్వర్లు, పలిశెట్టి ఆంజనేయులు బోరు తవ్వకం పనులను ప్రారంభించారు.

నగరేశ్వరుని జలాధివాసం



బొడ్రాయి వద్ద జలబిందెలతో మహిళలు

కారెంపూడి: గ్రామం సుభిక్షంగా ఉండాలని వర్షాలు పుష్కలంగా పడి పంటలు పండాలని ఆకాంక్షిస్తూ ఆర్యవైశ్య సంఘం మహిళలు గ్రామంలో బొడ్రాయికి, నగరేశ్వరస్వామికి ఆదివారం జలాభిషేకం చేశారు. మహిళలు భారీ సంఖ్యలో బిందెలతో నీటిని తీసుకుని అంకాలమ్మ గుడి సెంటర్‌లో ఉన్న బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం నగరేశ్వరస్వామి మూల విరాట్‌కు సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. రోజంతా స్వామి వారు జలాధివాసం చేసేవిధంగా అభిషేకించిన నీటిలో ఉంచారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మిత్తింటి సాంబశివరావు ఆర్యవైశ్య సంఘ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి మాత జన్మదిన వేడుకలు

రెంటచింతల: స్థానిక బాలవికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో వేంచేసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ద శెట్టి పల్లా వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆషాఢమాస అమావాస్య సందర్భంగా అమ్మవారి వేడుకల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుల నేతృత్వంలో వేకువ జాము నుంచే అమ్మవారికి ఉదయం 5గం.లకు సుప్రభాత సేవ, వేదపారాయణం, గణపతి పూజ, పుణ్యావాహచనం, పంచాంమృతాభిషేకాలు, నవగ్రహ మండపారాధన, ఉదయం 10గం.లకు సహస్రకుంకుమార్చన, మంత్ర పుష్పం జరిపించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరీ అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు చెస్ పోటీలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్

మాచర్ల: చెస్ పోటీల వల్ల మేధాశక్తి పెరుగుతుందని చెస్ కోచ్ కిరణ్ పేర్కొన్నారు. ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కోదండ రామాలయంలో ఆదివారం చెస్ పోటీలను మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ చేతుల మీదుగా ప్రారంభించి నిర్వహించినట్లు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. అతిథిగా వైఎస్సార్ సీపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని విచ్చేశారు. ఈ పోటీల్లో 50 మంది పాల్గొన్నారన్నారు. పాల్గొన్న వారికి జామెంట్రీ బాక్సులను దాత సెక్రెటరీ పందిరి నరసింహారావు అందజేశారు. వారు మాట్లాడుతూ చెస్ ఆట మేధాశక్తిని పెంపొందిస్తుందన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు చిన్నారులకు చెస్ పోటీని అలవర్చుకునేలా తమ చిన్నారులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, వనితా లక్ష్మీ అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కొత్తమాసు బ్రహ్మారావు, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజ్‌కుమార్, అన్నపూర్ణేశ్వరి ఆలయ సభ్యులు పందిరి బాల గురవయ్య, గంగిశెట్టి రాధాకృష్ణ, బొగ్గవరపు సామ్రాజ్యం తదితరులున్నారు.

నేడు ముటుకూరులో జగనన్న సురక్ష

దుర్గి: ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ముటుకూరు 1 గ్రామ సచివాలయం పరిధిలో ఉదయం 10గం''ల నుంచి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ సెక్రెటరీ పి శివశంకర్ రావు ఆదివారం తెలిపారు. మండల స్థాయి అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. పౌర సేవలకు సంబంధించి కొత్త రేషన్ కార్డు, మ్యారేజి సర్టిఫికెటు, ఆదాయం, కుల, సీసీఆర్సి, ఆధార్ మొబైల్ లింకు తదితర సేవలకు సంబంధించి ధ్రువపత్రాలను పంపిణీ చేస్తారని తెలిపారు.